ఐదేళ్ల మనవడు బంటికి అన్నం తినిపిస్తోంది అన్నపూర్ణమ్మ. వాడసలే ఉత్త వాగుడుకాయ. వాడితోపాటు తనూ వాగుతూ, గోరుముద్దలు తినిపిస్తోంది అన్నపూర్ణమ్మ.




"మరి నానమ్మా, నీకు అన్నం ఎవరు తినిపిస్తారు?"

"నేనే తింటాన్రా! నాకు ఒకళ్లు తినిపించేదేమిటే?"

"అది కాదు ... నీ చిన్నప్పుడు..."

"నా చిన్నప్పుడు కూడా నేనే తినేదాన్ని."

"అలాక్కాదే, నా అంత ఉన్నప్పుడు మీ నానమ్మగానీ, మీ మమ్మీ గానీ తినిపించలేదా?"

"నాకు వాళ్లెవరూ తెలీదురా బంటీ!"

"ఎందుకు తెలీదూ?"

"నాకు ఊహ వచ్చేసరికే వాళ్లంతా చచ్చిపోయారు. అయినా అవన్నీ నీకెందుకు? మాట్లాడకుండా ఈ నాలుగు ముద్దలూ గబగబా తినేయ్‌రా! అవతల స్కూల్‌కి టైమైపోతోంది...!" అన్నపూర్ణమ్మ బుజ్జగించింది.

"అదేం కుదరదు! చెప్పకపోతే తిననంతే!" మారాం చేశాడు బంటి.

"సరే, అలాగే కానీ ... ఇంద, ముందు ఈ ముద్ద తినరా బంగారుకొండా!"

"నానమ్మా! మరి నీకెవరూ లేరా?" మళ్లీ మొదలెట్టాడు వాగుడు.

"లేకపోవడమేమిట్రా, పిచ్చికన్నా! నా వరాలమూటవి నువ్వు లేవూ?"

"అది కాదే, ఇంకెవ్వ...రూ లేరా!" విసుగ్గా అడిగాడు బంటి.

"ఎందుకు లేరు! మీ నాన్న, అదేరా మీ డాడీ, మమ్మీ ఉన్నారుగా!"

"వాళ్లు కాదే, వేరే ఇంకె...వ్వ...రూ లేరా?"

"మీ తాతగారు ఉండేవారు."

"మరి వాడు నీకు అన్నం తినిపించేవాడు కాదా?"

"తప్పురా, మీ తాతగారిని వాడూ, వీడూ అంటావుట్రా భడవా!"

"అంటాను ... ఎక్కడున్నాడో చెప్పు ... వెళ్లి ఢిష్యూ ... ఢిష్యూ చేసేస్తా!"

"నువ్వు అంతటివాడివని తెలిసే, ఆయన ముందే వెళ్లిపోయారు."

"పోయాడా! నన్ను చూసి భయపడిపోయి ఉంటాడు. అహ్హహ్హా, మరి నేనంటే ఏటనుకున్నావ్ .... అవునూ, ఇంతకీ ఎక్కడికి పోయాడు?"

"పైకి ... దేవుడి దగ్గరకి ...!" ఈ మాటలంటున్నప్పుడు ఆమె కళ్లెందుకో చెమర్చాయి. చివరిముద్ద దిష్టితీసి పారేస్తూ "నువ్వు తొందరగా తయారవ్, ఆటో వచ్చేసే టైమైంది!" అంది.

"నానమ్మా! నువ్వేం బాధపడకు! తాతయ్య పోతే పోనీ ... నేను పెద్దయ్యాక నీకు అన్నం తినిపిస్తాలే!" అంటూ పుస్తకాలు సర్దుకోవడంలో పడ్డాడు బంటి.

పొద్దున ఈ సంఘటన జరిగిన దగ్గర్నుండే అన్నపూర్ణమ్మ మనసులో ఆర్నెల్లకింద చనిపోయిన భర్త జ్ఞాపకాలు మెదులుతున్నాయి. కన్నీటి ధారలు నిర్విరామంగా ప్రవహిస్తున్నాయి. వాలు కుర్చీలో నడుం వాల్చి, కళ్లు మూసుకు కూర్చుంది. అయినా ఆమెకు తన భర్త రూపం కళ్లముందే మెదులుతున్నట్లుంది. మనస్సులో దావానలంలా పెల్లుబుకుతున్న మనోవ్యథను ఎంత ప్రయత్నించినా అణచుకోలేకపోతోంది అన్నపూర్ణమ్మ.

"ఏమిటి పూర్ణా! ఏడుస్తున్నావా?" ఎక్కడో దూరం నుంచి వినిపించిందో గొంతు.

ఉలిక్కిపడి చుట్టూ కలియచూసింది అన్నపూర్ణమ్మ. ఎవ్వరూ కనిపించలేదు.

"పిచ్చిమొహమా, నేనేనే! నీ మొగుణ్ణి ... సుందర్రామయ్యని!" ఆప్యాయంగా పిలిచిన ఆ గొంతు తన భర్తదని తెలుసుకున్న అన్నపూర్ణమ్మ దుఃఖం రెట్టింపయింది.

"ఛ!ఛ! ... ఎందుకే ఏడుస్తున్నావ్. అయినా నీకేం లోటే? చక్కగా చూసుకునే కొడుకూ కోడలూ, సరదాగా వసబోసిన పిట్టలా వాగుతూ ఉండే నీ ముద్దుల మనవడు సుందర్! కాదు ... కాదు ... ఆ పేరుతో పిలిస్తే నన్న పేరుపెట్టి పిలిచినట్టవుతుందని నువ్వు అభ్యంతరం చెపితే, వాడికి ముద్దుపేరొకటి తగిలించాం కదూ నీ కోసం! ... అదేవిటి చెప్మా ... చంటా, బంటా?"

"బంటి!" దుఃఖాన్ని దిగమింగుతూ బదులిచ్చింది అన్నపూర్ణమ్మ.

"అవునవును, బంటే! మరి ఆ బంటిగాడితో నీకు మంచి కాలక్షేపమే కదా!"

"ఎందరుంటేనేమిటి? మీరు లేని ఈ జీవితాన్ని భరించలేకపోతున్నాను ... మీకు పుణ్యం ఉంటుంది ... నన్నూ మీతోనే తీసుకుపొండి!" అంటూ రోదించసాగింది అన్నపూర్ణమ్మ.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి.

"ఎందుకే నీవలా బాధపడిపోతున్నావ్? ఏం, కోడలు నిన్ను సరిగా చూడటంలేదా? లేకలేక పుట్టిన నీ ఏకైక గారాల పుత్రుడు ఏమైనా అంటున్నాడా?"

"అబ్బే, లేదండీ ... పాపం వాళ్లు నన్ను కంటికి రెప్పలా చూసుకుంటున్నారండీ ... మన కోడలు అందరిలాంటిదీ కాదు నిజంగా సుగుణాల రాశండీ!"

"ఇది ప్రపంచంలో మరో వింత!"

"ఏవిటండీ అది?" అమాయకంగా అడిగింది అన్నపూర్ణమ్మ.

"భారతదేశంలో ఒక అత్త తన కోడలికి మంచి కితాబు ఇవ్వడం ...! మరి నీ కింకేమిటి కొదవ? చక్కగా ఆదరించే కోడలు, పువ్వులా చూసుకునే కొడుకు, చక్కని కాలక్షేపాన్నిచ్చే 'బంటి'గాడూ ... నీకు మరి ఇంకేం కావాలే?"

"మీరు లేని లోటు భరించలేకపోతున్నానండీ!"

"అవును మరి. ఒకటా, రెండా ... సుమారు అరవై ఏళ్ల సుదీర్ఘ దాంపత్య అనుబంధం మనది.

"అబ్బ! అన్ని సంవత్సరాలూ ఇట్టే గడిచిపోయాయండీ!"

> అన్నపూర్ణమ్మ నిశ్చేష్టురాలయింది. చివరికి తెలివి తెచ్చుకుని, ఏమైనా సరే వెళ్లి ఆటో ఎక్కెయ్యాలని నిశ్చయించుకుంది. ఆమెకు ఆటో తప్ప మరే ధ్యాసా లేదు. ఇంకేమీ కనిపించటంలేదు ... తదేకంగా ఆటోనే చూస్తూ, గేటు తీసింది ... దృఢనిశ్చయంతో ముందుకు నడుస్తోంది. 'ఇంకో రెండడుగులు వేస్తే చాలు, వెళ్లి ఆటోలో కూర్చోవచ్చు' ... అనుకుంటూ మరో అడుగు ముందుకు వేయబోయింది...



"అవును. అప్పుడు నాకు ఇరవయ్యేళ్లు కాబోలు. బాల్య వివాహాలు జరుగుతూండేవి ఆ రోజుల్లో. అప్పటికి నా కింకా ఏ ఉద్యోగమూ లేదు."

"అవునవును, మన పెళ్లినాటికి నా వయసు ఎనిమిదేళ్లేనట! పెళ్లంటే ఏమిటో, సంసారం అంటే ఏవిటో తెలియని వయసు నాది. మా అమ్మా, నాన్నా, అందరూ వరదల్లో కొట్టుకుపోగా, మిగిలిన నన్ను మామయ్యగారు భుజాన ఎక్కించుకుని తీసుకొచ్చి, మీతో పెళ్లి జరిపించార్ట! అన్నట్టు పొద్దున్న బంటి ఏమన్నాడో తెలుసాండీ ... (సిగ్గుతో) మీరు నాకు అన్నం తినిపించేవారు కాదా? అని అడిగాడండీ!"

"మరి చెప్పలేకపోయావ్ మీ తాతే నాకు అన్నం తినిపిస్తూండేవాడని! ... ఆ సంగతి మర్చిపోయావా, పూర్ణా!"

"అబ్బ, ఆ సంగతి నే నెలా మరిచిపోగలను చెప్పండి. వంట చేస్తూ చేతులు కాల్చుకున్న ప్రతిసారీ, రెండు చేతులకీ గోరింటాకు పెట్టుకున్నప్పుడూ, మీరే తినిపించేవారుగా!"

"మరింకేం, ఆ సంగతి వాడికి చెప్పలేకపోయావ్?"

"ఛ, పాడు! " సిగ్గు మొగ్గయింది అన్నపూర్ణమ్మ.

"అయితే ఇంకేం! నీ వరాలపట్టి బంటిగాడితో సరదాగా నీ శేష జీవితాన్ని ఆనందంగా గడిపెయ్. దీనికింతగా బాధపడతావేమిటే పిచ్చిమొహమా?"

"మీరెన్నైనా చెప్పండి ... మీరు లేని ఈ జీవితం నాకు నరకంలా ఉంది. ఈ బతుకు నాకు వద్దు. నన్నూ మీతోనే తీసుకుపొండి!" అంటూ మళ్లీ ఏడవసాగింది అన్నపూర్ణమ్మ.

"అది ప్రకృతి విరుద్ధం, పూర్ణా! ప్రతి జీవీ తన జీవిత ప్రమాణ పర్యంతం జీవించాలి. తప్పదు. ఇది ప్రకృతి నియమం."

"అది కాదండీ, మీరు లేని ఈ నరకంలో ఇక ఒక్క క్షణం కూడా ఉండలేను. మీరు నన్నూ మీతో తీసుకువెళతారా, లేదా?"

"లేదు, పూర్ణా! అలా కుదరదు!"

"నాకదేం తెలీదు ... మీరు తీసుకు వెళ్లకపోతే, నేను ఏ నుయ్యో, గొయ్యో చూసుకునైనా మీ దగ్గరకి వచ్చేస్తాను!" మొండికేసింది అన్నపూర్ణమ్మ.

"తొందరపడి అలాంటి పనిగానీ చేసేవ్ దానివల్ల అబ్బాయికీ, కోడలికీ ఎంత అప్రతిష్ఠ కలుగుతుందో ఆలోచించావా? అయినా వాళ్లకు నువ్వు తప్ప వేరే పెద్ద దిక్కు ఎవరున్నారు చెప్పు?"

"అదిగో, మీరు మళ్లీ మాయమాటలతో నన్ను మభ్యపెడుతున్నారు. నా కింకేమీ చెప్పొద్దు! మీరు నన్ను తీసుకుపోతారా, లేదా?" నిష్కర్షగా అడిగింది.



"అది కాదు, పూర్ణా! నేను చెప్పేది కాస్త వింటావా?"

"వద్దు, ఇంకేం చెప్పొద్దు. నాకీ జీవితం వద్దు. దయచేసి నన్నూ మీతో తీసుకుపొండి!" అంటూ రోదించసాగింది.

అంతా నిశ్శబ్దం అన్నపూర్ణ ఏడుపు మినహా.

"అయితే తప్పదంటావ్?" మౌనాన్ని ఛేదిస్తూ అంది సుందర్రామయ్య ఆత్మ.

"అంతే ... ముమ్మాటికీ అంతే!"

"అయితే సరేలేవే, ... కానీ ఇప్పుడు మాత్రం నిన్ను నాతో తీసుకువెళ్లలేను."

"అదిగో, మళ్లీ మాట మార్చి, నన్ను మాయ చేయడానికి ప్రయత్నిస్తున్నారు ..." అన్నపూర్ణమ్మ ఏడుపు లంకించుకుంది.

"అది కాదే, పూర్ణా! నేను చెప్పేది కాస్త అర్థం చేసుకోడానికి ప్రయత్నించు ... నాకా రూపం లేదు. నీవు దేహధారివి. బొందితో కైలాసం సాధ్యం కాదు కదా! అందుకని ..."

"అందుకని నేను కూడా చచ్చిపోవాలా? ... సరేనండీ ... అలాగే, దానికీ నేను సిద్ధమే! మీరు నాకు ఉంటే చాలు!"

"సరే, అయితే విను. సరిగ్గా ఐదింటికి మనింటి ముందుకు ఒక ఆటో వచ్చి ఆగుతుంది. నువ్వు సిద్ధంగా ఉండాలి సుమా! ఆ ఆటో రాగానే నువ్వు వెంటనే వెళ్లి దానిలో కూర్చోవాలి. వెంట లగేజీ ఏమీ తీసుకురాకూడదు. ఆటో ఎంతోసేపు ఆగదు. కేవలం ఒక్క నిమిషంసేపే ఆగుతుంది. నువ్వెక్కినా, ఎక్కకపోయినా అది వెళ్లిపోతుంది. ఆ ఆటో డ్రైవర్ ఎవడైనా, ఎలా ఉన్నా నువ్వు పట్టించుకోకూడదు. వాడితో మాట్లాడకూడదు. ఎక్కడికి అని అడగకూడదు. తెలిసిందా?" ... అంతకంటే ముఖ్యమైన సంగతి మరొకటుంది.... ఈ విషయం ఎవ్వరికీ చెప్పకూడదు ... ఆఖరికి నీ బంటిగాడికి కూడా!" అంటూ అంతర్థానమయింది సుందర్రామయ్య ఆత్మ.

000

అన్నపూర్ణమ్మకు ఒక్కసారే ఒళ్లు జలదరించి, వాస్తవంలోకి వచ్చింది. ఆమె మనస్సులో ఎన్నో ప్రశ్నలు గింగుర్లు కొడుతున్నాయి.

'ఇదంతా నిజమా, కలా?

నిజంగా ఆటో వస్తుందా? ... వస్తే ఎన్నింటికి? ఉదయం ఐదింటికా, సాయంత్రం ఐదింటికా?

వస్తే వెళ్లిపోవాలా, వద్దా?

అబ్బాయీ కోడలూ ఉద్యోగాలకు పోతారు మరి, నేను కూడా లేకుండా పోతే ... ఇంటినెవరు కనిపెట్టుకుని ఉంటారు? ... బంటిని ఎవరు చూస్తారు?

'ఆటో వస్తే, దానిలో ఎక్కి కూర్చుంటే, అది నన్నెక్కడికి తీసుకుపోతుంది? ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణం పోతుందా? అమ్మో ... చావే!?'

అంతలో ఆటో చప్పుడు ...

ఆ ఇంటివైపే వస్తున్న చప్పుడు వినిపించింది.

అంటే సుందర్రామయ్య చెప్పింది నిజం కాబోతోందా?

అప్రయత్నంగా భయంభయంగా అన్నపూర్ణమ్మ గడియారం వైపు చూసింది. రెండు నిమిషాలు తక్కువ ఐదయింది. అన్నపూర్ణమ్మ గుండె వేగంగా కొట్టుకోసాగింది. ... ఇంకా ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉంది.

మరోవైపు

ఆటో చప్పుడు అంతకంతకూ దగ్గరవుతూ ఉంది.

అన్నపూర్ణమ్మ నోట తడి ఆరిపోతోంది.

ఆటో చప్పుడు అంతకంతకూ దగ్గరగా ... ఇంకా దగ్గరగా ... ఇంకా ... ఇంకా .... మరింత దగ్గరగా వినిపించసాగింది. అన్నపూర్ణమ్మ గుండె దడదడా వేగంగా కొట్టుకోసాగింది.

గోడ గడియారం ఠంగ్‌మని ఐదు గంటలు కొట్టింది. అంతే! ఒక్క క్షణంలో ఆటో వచ్చి ఇంటి ముందు ఆగింది.

అన్నపూర్ణమ్మ నిశ్చేష్టురాలయింది. చివరికి తెలివి తెచ్చుకుని, ఏమైనా సరే వెళ్లి ఆటో ఎక్కెయ్యాలని నిశ్చయించుకుంది. ఆమెకు ఆటో తప్ప మరే ధ్యాసా లేదు. ఇంకేమీ కనిపించటంలేదు ... తదేకంగా ఆటోనే చూస్తూ, గేటు తీసింది ... దృఢనిశ్చయంతో ముందుకు నడుస్తోంది. 'ఇంకో రెండడుగులు వేస్తే చాలు, వెళ్లి ఆటోలో కూర్చోవచ్చు' ... అనుకుంటూ మరో అడుగు ముందుకు వేయబోయింది.

అంతలో ... ఎవరో బలంగా వెనక్కి లాగిపెట్టినట్లయింది.

బంటి ... కొంగు పట్టుకుని లాగుతున్నాడు.

"ఎక్కడికిపోతున్నావే నానమ్మా? నాకు అన్నం తినిపించవూ?"

పెద్దగా రొద చేసుకుంటూ ఆటో వెళ్లిపోయింది.

బంటి పుస్తకాల సంచి భుజాన వేసుకుని, వాణ్ణి ఎత్తుకుని ఇంట్లోకి దారితీసింది అన్నపూర్ణమ్మ నిట్టూరుస్తూ.

అన్నపూర్ణమ్మకు మళ్లీ కలలో సుందర్రామయ్య కనిపించలేదు.

■

"నీ భార్య నువ్వు చావాలని కోరుకుంటోందని ఎలా అనుకొంటున్నావ్?"

"నేను పులి, సింహాల వేటకు వెళుతున్నానని చెబితే నాకు లేడిచర్మంతో చేసిన కోటు ఇచ్చింది."

కలవర్తి సత్యం, ఏలూరు



